శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలుకుతున్న ఆలయ చైర్మన్ మల్లారెడ్డి

బ్రహ్మోత్సవాలకు రావాలని మండలి చైర్మన్ గుత్తాకు ఆహ్వానం

భూదాన్ పోచంపల్లి, మార్చి 3 : మండలంలోని కనుముక్కుల గ్రామంలో గల పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ కోట మల్లారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని గుత్తా నివాసంలో ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాలకు హాజరు కావాలని కోరారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 3 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అర్హులందరికీ పథకాలను అందజేస్తామన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఎల్లమ్మ, రాజు, నజియా, జహంగీర్, ఉమాదేవి, వినోద్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

భూదాన్ పోచంపల్లి, మార్చి 3 : మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన అబ్బసాని వెంకటయ్యకు గుండె వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన లక్షా 75 వేల రూపాయల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదివారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు లింగస్వామియాదవ్, ఉప్పునూతల శ్రీశైలం, సాయి, కృష్ణ, అబ్బసాని రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

నేడు మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్

మోత్కూరు, మార్చి 3 : మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, భువనగిరి ఆర్డీఓ అమరేందర్ సమక్షంలో సోమవారం ఉదయం 10గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు జనవరి 20న అవిశ్వాసం ప్రకటించి తీర్మానాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 9న నిర్వహించిన అవిశ్వాస సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటింగ్ చేయడంతో అవిశ్వాసం నెగ్గింది. సోమవారం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 11వ వార్డు కౌన్సిలర్ గుర్రం కవితను చైర్‌పర్సన్‌గా ఎన్నుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్యతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన 9మంది కౌన్సిలర్లు ప్రత్యేక శిబిరంలో ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేసిన తీపిరెడ్డి సావిత్రి, పదో వార్డుకు చెందిన బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి సోమవారం సమావేశానికి గైర్హాజరు కానున్నట్లు తెలిసింది.

నిండు జీవితానికి రెండు చుక్కలు

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

అడ్డగూడూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

యాదగిరిగుట్ట, మార్చి 3 : చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు చాలని, అప్పుడే పుట్టిన పాప నుంచి ఐదేండ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పని సరిగా వేయించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు పలు వార్డుల్లో పోలియో చుక్కల పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలియో చుక్కలు వేయిస్తే వ్యాధిని నివారించవచ్చన్నారు. పోలియో మహమ్మారితో అనేక కుటుంబాలు అంగవైకల్యాలనికి గురికావడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. తన ఒక నెల వేతనంతో ఆస్పత్రిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఆసుపత్రిలో సమావేశ గది కావాలని వైద్యులు కోరగా ఆస్పత్రి ఆవరణంలో భూమిని పరిశీలించి నిర్మాణానికి కావాల్సిన నిధులను కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, కౌన్సిలర్లు గౌలికార్ అరుణ, ముక్యర్ల మల్లేశ్, నాయకులు భరత్‌గౌడ్, ఆంజనేయులు, భిక్షపతి పాల్గొన్నారు.

చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలి

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, మార్చి 3 : ఐదేండ్లలోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పక పోలియో చుక్కలు వేయించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సూచించారు. మండల కేంద్రంలో, ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో చిన్నారులకు చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఊరూరా పోలియో చుక్కల పంపిణీ

రాజాపేట : మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 2,947 మంది చిన్నారులకు గాను 2,799 మందికి పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి సుప్రియా తెలిపారు.

ఆలేరు రూరల్ : చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ గంధమల్ల అశోక్ అన్నారు. శారాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పోలియో కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నవీన్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తుర్కపల్లి : పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వాసాలమర్రి ఎంపీటీసీ పలుగుల నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంతో పాటు వాసాలమర్రి, దత్తాయపల్లి తదితర గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్ పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : ఐదేండ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో పల్స్ పోలియోను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

వలిగొండ : మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్లు, గ్రామ కూడళ్లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ జ్యోతి సూచించారు.

చౌటుప్పల్ : మండలంలో 40 కేంద్రాల్లో 5,746 మంది చిన్నారులకు గాను 5,614 మందికి పోలియో చుక్కలు వేశారు. మిగతా వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో డ్రాప్స్ వేయనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మెడికల్ ఆఫీసర్ చింతకింది కాటంరాజు, పుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ సుమన్ కళ్యాణ్, వార్డు కౌన్సిలర్ బాబాషరీఫ్ పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని జడ్పీటీసీ పున్న లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం పోలియో చుక్కలు దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు వనం హర్షిని, గాదె పారిజాత, పీహెచ్‌సీ వైద్యాధికారి అశ్విన్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : ఐదేండ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ తండ మంగమ్మ, జడ్పీటీసీ నరేందర్ గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కల పంపిణీని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి విలియం కేరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని సోలిపేట గ్రామంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 23 సెంటర్ల ద్వారా 2,721 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలో మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి పల్స్ పోలియోను ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 40 బూత్‌లలో 4,170 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మొబైల్ టీం ద్వారా శివారు ప్రాంతాల్లోని క్రషర్లు, కంపెనీల్లోని పిల్లలకు పోలియో డ్రాప్స్ వేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీవాణి, ఎంపీటీసీ బత్తుల మాధవి, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలో 1,849 మంది పిల్లలకు గాను 1,765 మందికి పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. పోలియో చుక్కల నమోదు 95శాతం పూర్తయిందన్నారు. మిగతా పిల్లలకు సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో డ్రాప్స్ వేస్తారని తెలిపారు.

మోటకొండూర్ : మండలంలో 26 బూత్‌ల ద్వారా 1,428 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి విజయ్ తెలిపారు. మండల కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వంశీ కృష్ణ పరిశీలించారు.

యాదగిరిగుట్టలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

మోటకొండూరులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ

చౌటుప్పల్ : బస్టాండ్ వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

రాజాపేటలో పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న మండల వైద్యాధికారి సుప్రియా

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

రామన్నపేట, మార్చి 3 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు ఎడ్ల నరేందర్‌రెడ్డి నిర్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ బ్యాడ్మింటన్ కోర్టును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. శారీరక ధృడత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు వారిని సన్మానించారు. మిర్యాల నాగార్జున, ఈడెం శ్రీనివాస్, అవనగంటి నగేశ్, సతీశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, రాజిరెడ్డి, కిశోర్, రాజేంద్రవర్మ పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మోటకొండూర్, మార్చి 3 : మండలంలోని గ్రామాల్లో నేటి నుంచి ఏర్పాటు చేయనున్న ప్రజాపాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. గతంలో చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తుల్లో ఏమైనా తప్పులు ఉంటే ప్రజాపాలన సేవా కేంద్రాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), మార్చి 3 : మండలంలోని కొరటికల్ గ్రామపంచాయతీ సిబ్బంది ఎలిమినేటి యాదయ్య భార్య యాదమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని సర్పంచ్ కోల సత్తయ్యగౌడ్ పరామర్శించి రూ.60వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సైదులు, యాదగిరి, స్వామి ఉన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు

గెలుపొందిన క్రికెట్ టీమ్ సభ్యులతో ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు

చౌటుప్పల్ రూరల్, మార్చి 3 : మండలంలోని కొయ్యలగూడెంలో ఆదివారం కొయ్యలగూడెం, ఎల్లంబావి గ్రామాల మధ్య ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి బహుమతి (రూ.55,116) టీఎల్ఎస్ టీమ్, రెండో బహుమతి (రూ.30,116) శివం డెవలపర్స్ జట్లు గెలుచుకున్నాయి. విజేతలకు ఎంపీటీసీ జెల్లా ఈశ్వరమ్మ బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాచర్ల కృష్ణ, ఆర్గనైజర్లు గుర్రం భాస్కర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గణేశ్, మధు, రమేశ్, అశోక్, భిక్షపతి, శ్రీను పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంలో చదువును గెలువాలి

● ఏఎస్‌డబ్ల్యూఓ వసంతకుమారి

యాదగిరిగుట్ట, మార్చి 3 : ఆత్మహత్య సరైన నిర్ణయం కాదు.. ఆత్మస్థైర్యంతో చదువును గెలువాలని ఏఎస్‌డబ్ల్యూఓ వసంతకుమారి అన్నారు. విద్యార్థినులు క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థినులు, తల్లిదండ్రులకు ఆదివారం ఆత్మహత్యల నివారణ, మానసిక స్థైర్యం పెంపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువులో ఒత్తిడి, సమస్యలకు లోనుకాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీఓ సరిత, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల, కౌన్సిలర్, కో ఆర్డినేటర్ దశరథ, వసతి గృహ సంక్షేమ అధికారి సోనీ పాల్గొన్నారు.

గుట్టలో నిర్లక్ష్యానికి పాడి ఆవు మృతి

యాదగిరిగుట్ట, మార్చి 3 : యాదగిరిగుట్ట దేవస్థాన అధికారుల నిర్లక్ష్యంతో పాలిచ్చే ఆవు మృత్యువాతకు గురైంది. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో సుమారు 234 ఆవులు ఉన్నాయి. ఇందులో 23 ఆవులు పాలిచ్చేవి ఉండగా రోజుకు 55 లీటర్ల పాలను సేకరించి స్వామివారి నిత్య పూజలకు వినియోగిస్తారు. కాగా, ప్రతి రోజూ రాత్రి సమయంలో మల్లాపురం రెవెన్యూ పరిధిలోని గోశాలలో గల కొట్టంలో ఉంచుతారు. అక్కడ ఆవుల మేత కోసం ప్రత్యేకంగా నిర్మించిన కొలనులో ప్రమాదవశాత్తు ఆవు పడిపోయి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. అర్ధరాత్రి అయినా దేవస్థాన సిబ్బంది గమనించకపోవడంతో ఆవు మృతి చెందింది. దీనిపై గోశాల అధికారి బాలాజీనాయక్‌ను వివరణ కోరగా ప్రమాదవశాత్తు మృతి చెందిందని, ఆ సమయంలో అధికారులు ఎవరూ లేరని తెలిపారు. గతంలోనూ అధికారుల నిర్లక్ష్యంతో ఆవులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయని, దీనిపై దేవస్థాన అధికారులు స్పందించి ఆవులను పరిక్షించాలని భక్తులు కోరుతున్నారు.

గురుకుల ఉద్యోగాల సాధనలో సంస్థాన్ యువతుల సత్తా

● ఒకేసారి మూడు కొలువులు సాధించిన లావణ్య

ఇంట్లో చదువుకుంటూనే మూడు ఉద్యోగాలు సాధించిన లావణ్య

సంస్థాన్ నారాయణపురం, మార్చి 3 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గురుకుల పరీక్షల ఫలితాల్లో సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన ఎనిమిది మంది అభ్యర్థులు జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. ఇద్దరు ఒకేసారి మూడు ఉద్యోగాలకు, ఒకరు రెండు ఉద్యోగాలకు, మరొకరు మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి శభాష్ అనిపించుకున్నారు. మండల వ్యాప్తంగా ఎనిమిది మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించగా అందులో ఆరుగురు మహిళా అభ్యర్థులే. వారికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రెండు ఉద్యోగాలతో తండ్రి కల నెరవేర్చిన హిమబిందు

నారాయణపురం మండల కేంద్రానికి చెందిన నందయ్య, కరుణ దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రైవేట్ టీచర్‌గా పని చేసే నందయ్య తన కూతురు ప్రభుత్వ కొలువు సాధించాలని కష్టపడి చదివించాడు. చౌటుప్పల్ గురుకుల పాఠశాలలో చదువుకున్న హిమబిందు పదో తరగతిలో 546 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

రెండు ఉద్యోగాలు సాధించి తండ్రి కోరిక నెరవేర్చిన హిమబిందు

ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసిన హిమబిందు వివాహం అనంతరం కోచింగ్ లేకుండా ఇంట్లోనే ఉండి కాంపిటిషన్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యింది. గురుకుల జూనియర్ లెక్చరర్, ఇంగ్లిష్ విభాగంలో టీజీటీ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది. 'మా నాన్న నన్ను టీచర్‌గా చూడాలని కలలు కనేవాడు. ఏడాది క్రితం ఆయన చనిపోయాడు. ఇప్పుడు టీచర్ ఉద్యోగం వచ్చినందుకు మా నాన్న బతికి ఉంటే ఎంతో సంతోషించేవాడు. మా నాన్న కోరిక నెరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉన్నది. నా భర్త సహకారం, ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించా.' అని హిమబిందు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ కూతురుకు టీజీటీ ఉద్యోగం

నారాయణపురం మండలంలోని ఆంగోతు తండాకు చెందిన ఆంగోతు పరశురాం, విజయలక్ష్మి దంపతులది నిరుపేద కుటుంబం. పరశురాం ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వారి కూతురు సంతోష ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఆయా ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కాలేజీల్లో చదివింది. ప్రస్తుతం మొయినాబాద్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న ఆమె.. తొలి ప్రయత్నంలోనే సోషల్ స్టడీస్‌లో టీజీటీ ఉద్యోగానికి ఎంపికైంది. నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

టీజీటీ ఉద్యోగం సాధించిన ఆటో డ్రైవర్ కూతురు సంతోష

ఇంట్లోనే ప్రిపేరై మూడు ఉద్యోగాలు..

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన మేకని భిక్షపతి, నాగమణి దంపతులది నిరుపేద చేనేత కుటుంబం. ఇద్దరూ మగ్గం పనులు చేస్తూ పిల్లలను కష్టపడి చదివించారు. చదువులో చురుకుగా ఉండే పెద్ద కూతురు లావణ్య మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 542 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఓయూలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన లావణ్య వివాహం అనంతరం ఇంట్లోనే చదువుతూ పోటీ పరీక్షలకు సిద్ధమైంది. కోచింగ్‌కు పోకుండానే సొంతంగా చదువుకుంటూ తొలి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ మ్యాథమెటిక్స్ విభాగంలో మూడు ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది.

రామకృష్ణుని భక్తి అనన్యసామాన్యం

● సిద్ధగురు రమణానందమహర్షి

రమణేశ్వరంలో పూజా కార్యక్రమాలు చేపడుతున్న రమణానందమహర్షి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 3 : సిద్ధగురు రామకృష్ణ పరమహంస అవధూత అని, కాళికామాతతో నేరుగా మాట్లాడిన తాంత్రిక యోగీశ్వరుడని సిద్ధగురు రమణానందమహర్షి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 45 శివలింగాలకు, 35 విగ్రహమూర్తులకు 36 ద్రవ్యాలతో యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులతో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణేశ్వరంలో స్థాపితమవుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపన మరెక్కడా, ఎన్నడూ జరుగలేదన్నారు. భక్తుల నడుమ ఇంతటి మహాకార్యం జరుపుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బట్టిమైసమ్మ ఆలయ హుండీల ఆదాయం రూ.1,16,600

వలిగొండ, మార్చి 3 : మండలంలోని నాగారం గ్రామంలో బట్టి మైసమ్మ దేవాలయం హుండీలను ఆదివారం లెక్కించారు. ఒక సంవత్సరంలో భక్తులు సమర్పించిన కానుకలు హుండీల ద్వారా 1,16,600 రూపాయలు వచ్చినట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

కార్యక్రమంలో కమిటీ సభ్యులు బెలిదె నాగేశ్వర్, బెలిదె శ్రీనివాస్, గోళ్ల పెద్దభిక్షపతి, పోలు నాగయ్య, బర్ల సత్తయ్య, మైసోళ్ల సత్యం, అల్లి వెంకటేశం, ఎల్లంకి స్వామి, భక్తులు పాల్గొన్నారు.